సాక్షి ఒడిశా

గురువారం । 20 । ఫిబ్రవరి । 2025

నేటి గుణుపురం-పూరీ ఎక్స్‌ప్రెస్ క్యాన్సిల్

పర్లాకిమిడి: గుణుపురం-పూరీ మధ్య నడిచే (18418) ఎక్స్‌ప్రెస్ రైలు గురువారం నిలుపుదల చేసినట్లు ఈస్టుకోస్టు రైల్వే అధికారులు ప్రకటించారు. అలాగే పూరీ- గుణుపురం ఎక్స్‌ప్రెస్ కూడా ప్లాట్‌ఫారం పనుల వల్ల బుధవారం నిలుపుదల చేశారు.



కమ్యూనిస్టుల పర్యటన

కొరియా గ్రామాల్లో కమ్యూనిస్టు నాయకులు పర్యటించారు. వీరు సాలూరుకు చెందిన వారు.

- 8లో



బర్డ్ ఫ్లూ భయం లేదు

బర్డ్ ఫ్లూ భయం లేదని అధికారులంటున్నారు. రాయగడలో కోళ్లను పరీక్షించారు.

- 8లో

న్యూస్‌రీల్

పాత్రికేయుల సంక్షేమానికి కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షుడు సుశాంత్ బెహరా

కొరాపుట్: పాత్రికేయుల సంక్షేమానికి కొత్త ప్రభుత్వం కృషి చేయాలని ఒడిశా యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ నబరంగ్‌పూర్ జిల్లా శాఖ అధ్యక్షుడు సుశాంత్ బెహరా కోరారు. బుధవారం నబరంగ్‌పూర్ జిల్లా పపడాహండి సమితి కేంద్రం సమీపంలో డీర్ పార్క్ సమీపంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన సదస్సులో ప్రసంగించారు. ఇతర రాష్ట్రాలలో ఆయా ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఒడిశాలో కూడా అమలు చేయాలన్నారు. పాత్రికేయులపై దాడులు జరిగితే సంఘాలకు అతీతంగా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఇటీవల ఒడిశా పాత్రికేయులను ఛత్తీస్‌గఢ్ పోలీసులు అవమానించినప్పుడు కలిసికట్టుగా పోరాటం చేసిన సంగతిని గుర్తు చేశారు. అర్హులను జర్నలిస్టులకు పింఛన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం కార్యదర్శి చిదానంద సాహు, ఉపాధ్యక్షుడు ఫల్గుణి పాత్రో తదితరులు పాల్గొన్నారు.

జలాశయంలో మునిగి మహిళ మృతి



ఇచ్ఛావాతి కిర్సనీ మృతదేహం

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండ జలాశయంలో మునిగి ఇచ్ఛావాతి కిర్సనీ (40) అనే మహిళ మునిగి ప్రాణాలు కోల్పోయింది. చిత్రకొండ సమితి పనాస్‌పుట్ పంచాయతీ, డమ్‌గూఢ బుద కిర్సానీ భార్య ఇచ్ఛావాతి కిర్సనీ మంగళవారం మధ్యాహ్నం దుస్తులు ఉతికేందుకు చిత్రకొంత జలాయంలోకి దిగారు. అయితే ప్రమాదవశాత్తు కాలు జారి మునిగిపోయారు. సాయంత్రమైన ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు స్థానికులతో కలిసి గాలించారు. బుధవారం ఉదయం 11 గంటల సమయంలో జలాశయంలో మహిళ మృతదేహం తేలుతూ కనిపించడంతో జోడాంబో పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఇన్‌చార్జి సంజాయ్ పడాసేతి సిబ్బందితో కలిసి జలాశయం వద్దకు చేరుకొని మృతదేహాన్ని బయటకు తీశారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్రకొండ ఆరోగ్య కేంద్రానికి తరలించారు. మృతురాలికి భర్త, ఇద్దరు కుమారులు ఉన్నారు.

టీచర్ వేధింపులు.. చిన్నారులు పరార్

- అడవిలో రక్షించిన గిరిజనులు



అటవీ ప్రాంతంలో చిన్నారులను రక్షించిన గిరిజనులు

కొరాపుట్: ప్రధానోపాధ్యాయురాలి వేధింపులతో చిన్నారులు ఆశ్రమ పాఠశాల నుంచి పరారయ్యారు. బుధవారం నబరంగ్‌పూర్ జిల్లా పపడాహండి సమితి గడబకొత్ర అశ్రమ పాఠశాలలో 3వ తరగతి చదువుతున్న ముగ్గురు బాలురు మెయిన్ గేటు గెంతి పరారయ్యారు. వీరు దట్టమైన అటవీ ప్రాంతంలో నదులు, కొండలు దాటుకుంటూ 15 కిలోమీటర్లు నడిచారు. వన్య ప్రాణులు తిరిగే దట్టమైన అటవీ ప్రాంతంలో చిన్నారుల కదలికలను గిరిజనులు గుర్తించి సంరక్షించారు. చిన్నారులు స్పందిస్తూ తమకు ఆశ్రమ పాఠశాలలో పెద్ద తరగతుల విద్యార్థులు వేధిస్తున్నారని, ఈ విషయం చెబితే ప్రధానోపాధ్యాయురాలు మరింత వేధించారని కన్నీరు పెట్టుకున్నారు. తమ స్వగ్రామం జొరిగాం సమితి నువాగుడకి కాలినడక పయనమయ్యామని తెలిపారు. వారికి వెంటనే గిరిజనులు బిస్కెట్లు ఇచ్చి తల్లిదండ్రులు, పాఠశాలకు సమాచారం అందజేశారు. ప్రధానోపాధ్యాయురాలి భర్త హుటాహుటిన అక్కడకు చేరుకుని చిన్నారులను ఆశ్రమ పాఠశాలకు తరలించారు. ఈ విషయం సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం కావడంతో అధికారులు విచారణకు ఆదేశించారు.

పర్లాకిమిడి రైల్వేస్టేషన్‌కు.. మహర్దశ

- అమృత్‌స్టేషన్ల నవీకరణలో భాగంగా అభివృద్ధి పనులు
- శరవేగంగా పనుల నిర్వహణ



పర్లాకిమిడి రైల్వేస్టేషన్ వద్ద పూర్తయిన ముందుభాగం పనులు

పర్లాకిమిడి:

అమృత్ స్టేషన్ల నవీకరణలో భాగంగా పర్లాకిమిడి రైల్వేస్టేషన్‌కు మహర్దశ పట్టింది. నౌపడ నుంచి పర్లాకిమిడి, గుణుపురం వరకు డబుల్ లైన్స్ వేయడమే కాకుండా పర్లాకిమిడి, గుణుపురం రైల్వే స్టేషన్లను అత్యంత సుందరంగా ఆధునికీకరిస్తున్నారు. మరికొద్ది రోజుల్లోనే స్టేషన్ పనులు పూర్తి కానున్నాయి. ప్రస్తుతం పర్లాకిమిడి స్టేషన్‌లో ఓవర్ బ్రిడ్జిపనులు చురుగ్గా సాగుతున్నాయి. సీనియర్ సిటిజన్ ప్యాసింజర్లు ప్లాట్‌ఫారం మారడానికి లిఫ్టు సౌకర్యం సైతం కల్పిస్తున్నారు. రైల్వేస్టేషన్ వద్ద రోడ్డు పనులు సైతం శరవేగంతో పూర్తి చేస్తున్నారు. ఇక్కడ రైల్వేస్టేషన్ ఘనత పర్లాకిమిడి మహారాజా శ్రీకృష్ణచంద్ర గజపతి నారాయణ దేవ్‌కు దక్కుతుంది. నౌపడ నుంచి పర్లాకిమిడికి 91 కిలోమీటర్ల నేరో గేజ్‌పై స్టీమ్ ఇంజనును అప్పట్లో రూ.96 లక్షల సొంత నిధులు వెచ్చించి వెచ్చించి రైళ్ల రాకపోకలకు శ్రీకారం చుట్టారు. తదనంతరం పర్లాకిమిడి నుంచి గుణుపురం వరకు రైల్వేలైన్ పొడిగించారు. ప్రస్తుతం పర్లాకిమిడి నుంచి గుణుపురం అక్కడి నుంచి పూరీ, భువనేశ్వర్, రూర్కెలా, విశాఖపట్నం వరకు మూడు రైళ్లు నడుస్తున్నాయి. కేంద్ర, రాష్ట్రాల్లో డబుల్ ఇంజిన్ సర్కారు నడుస్తున్న తరుణంలో కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ రైల్వే నవీకరణకు నడుంబిగించారు. ఒడిషాలో రైల్వేస్టేషన్లు, ట్రాక్స్ ఆధునీకరణకు 2025–26 రైల్వే బడ్జెట్‌లో రూ.10,599 కోట్ల నిధులు కేటాయించారు. గత పదేళ్లలో 2వేల 46 కిలో మీటర్ల రైల్వే ట్రాక్స్ నిర్మాణం చేపట్టారు. రాష్ట్రంలో 59 రైల్వేస్టేషన్లను అమృత్‌స్టేషన్ల పథకం క్రింద అభివృద్ధి చేస్తున్నారు.



పర్లాకిమిడి రైల్వేస్టేషన్‌కు తుది మెరుగులు



ప్యాసింజర్ ప్లాట్ ఫారం మారడానికి వీలుగా ఓవర్ బ్రిడ్జి నిర్మాణం



రైల్వేస్టేషన్ ఆవరణలో రోడ్డు నిర్మాణం



చురుగ్గా సాగుతున్న లిఫ్టు, ఓవర్ బ్రిడ్జి పనులు

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

రాయగడ: స్థానిక మెయిన్ మార్కెట్ నుంచి సబ్ కలక్టర్ కార్యాలయంకు వెళ్లే అండర్‌గ్రౌండ్ రహదారి వద్ద ఒక గుర్తు తెలియని యువకుని మృతదేహాన్ని పోలీసులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. అండర్‌గ్రౌండ్ రహదారి మధ్య యువకుని మృతదేహం పడి ఉండటంతో అటు వైపుగా వచ్చి వెళ్లేవారు చూసి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసకుని కేసు నమోదు చేశారు. మృతుని వివరాలు తెలిస్తే తమకు సమాచారం ఇవ్వాలని స్థానికులకు సూచించారు.

ముగ్గురు చైన్‌స్నాచర్లు అరెస్టు



నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న బంగారు మంగళ సూత్రాలు



పోలీసులు అరెస్టు చేసిన కర్నాల హరిజన్, రమేష్ హరిజన్, గోపీనాథ్ హరిజన్

జయపురం: మహిళలపై దాడి చేసి మంగళసూత్రాలు, బంగారు గొలుసులను తెంచుకు పోతున్న ముగుర్గు దొంగలను అరెస్టు చేసినట్లు జయపురం సదర్ పోలీసు అధికారి ఈశ్వర చంద్ర తండి బుధవారం తెలిపారు. జయపురం సదర్ పోలీసు స్టేషన్ పరిధి సిందిగుడ గ్రామానికి చెందిన కనకదేయి భొత్ర గత ఏడాది అక్టోబర్ మూడో తేదీ సాయంత్రం ఐదు గంటల సమయంలో కనకదెయి భొత్ర హడియగండగుడ నుంచి సిందిగుడ గ్రామం వస్తుండగా ముఖాలకు మాస్కులు వేసుకున్న ముగ్గురు గుర్తు తెలియని దుండగులు తెల్లని మోటారు బైక్‌పై వచ్చి ఆమె మెడలో ఉన్న మంగళ సూత్రాలను బలవంతంగా తెంచుకు పోయారు. దీనిపై మరుసటి రోజున పోలీసులకు ఆమె ఫిర్యాదు చేశారు. అలాగే ఈ నెల 18వ తేదీన పేపరుమిల్లు జంక్షన్ వాసి ప్రకాశ్ చంద్ర మహంతి కూడా చైన్‌స్నాచింగ్ జరిగినట్లు ఫిర్యాదు చేశారన్నారు. గత డిసెంబర్ మూడో తేదీన తెల్లవారుజామున 4.30 గంటల సమయంలో ప్రకాశ్ మహంతి భార్య ప్రమీళ మహంతి ఇంటిముందు వాకిలి పరిశుభ్ర పరుస్తున్న సమయంలో ముగ్గురు దుండగులు మోటారు బైక్‌పై వచ్చి ఆమె మెడలోని మంగళసూత్రాలతో ఉన్న బంగారు లాకెట్‌ను తెంచుకు పోయారని ఫిర్యాదులో పేర్కున్నారు. 1.5 తులాల మంగళసూత్రాల విలువ లక్ష రూపాయలకు పైన ఉంటుందని ఫిర్యాదులో తెలిపారు. కేసు నమోదు చేసి ముమ్మర దర్యాప్తు చేసిన పోలీసులు ఈ రెండు కేసులలో నిందితులు దొంగిలించిన తీరును బట్టి ఒక ముఠాయేనని దర్యాప్తులో వెల్లడైందని వారిని గుర్తించి బుధవారం అరెస్టు చేసామని బుధవారం తెలిపారు. అరెస్టయిన వారిలో కుంద్ర సమితి గొరహండి గ్రామానికి చెందిన నరహరి హరిజన్ కుమారుడు కర్నాల్ హరిజన్, కుంద్ర సమితి భటిగుడ గ్రామం సామరు హరిజన్ కుమారుడు రమేష్ హరిజన్, కుద్రా సమితి బుటుగుడ గ్రామానికి చెందిన గోపీనాథ్ హరిజన్ కుమారుడు త్రినాథ్ హరిజన్ ఉరఫ్ బుటు హరిజన్ ఉన్నారన్నారు. నిందితుల నుంచి మూడు తులాల బరువున్న రెండు మంగళ సూత్రలు, ఒక మోటారుబైక్‌ను స్వాధీనం చేసుకున్నట్టు పోలీసు అధికారి ఈశ్వర తండి వెల్లడించారు. ముగ్గురిని కోర్టులో హాజరు పరిచామన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పేర్కొన్నారు.

దారి దొంగల అరెస్ట్



నబరంగ్‌పూర్ పోలీసులు అరెస్ట్ చేసిన దోపిడీ దొంగలు

కొరాపుట్: దారి దోపిడీ దొంగలను నబరంగ్‌పూర్ జిల్లా కేంద్ర పోలీస్ స్టేషన్ పోలీసులు అరెస్ట్ చేశారు. బుధవారం సాయంత్రం ఐఐసీ సంబిత్ బెహరా ఈ కేసు వివరాలు ప్రకటించారు. ఈ నెల 16వ తేదీ రాత్రి 11 గంటల సమయంలో నందాహండి సమితి గరుడ గుడ గ్రామానికి చెందిన త్రినాథ్ బొత్ర నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలో దసరాపొద మార్గంలో జిల్లా కేంద్రాస్పత్రికి వెళ్తుండగా ముగ్గురు వ్యక్తులు దాడి చేసి డబ్బులు, మొబైల్, బైక్ తీసుకెళ్లిపోయారు. బాధితుడు పోలీస్ స్టేషన్‌కి వెళ్లి ఫిర్యాదు చేశారు. సెల్ సిగ్నల్ ఆధారంగా నిందితులు సరాపొదకి చెందిన సిద్దు హరిజన్, టింకు హరిజన్, లోహరా శాలకి చెందిన హుస్సేన్ హరిజనలను పోలీసులు అరెస్టు చేశారు.

బోడజాత్రకు ఏర్పాట్లు



బోడ జాత్ర దేవతా మూర్తుల విగ్రహాలు

మల్కన్‌గిరి: జిల్లాలో ప్రసిద్ధ బోడ జాత్ర నెల రోజుల పాటు సాగనుంది. గిరిజన సంప్రదాయంలో ముత్యాలమ్మ తల్లితో కలిసి శ్రీకృష్ణుడు కసంరాజుగా, అర్జునుడు బాలరాజ్‌గా, భీముడు పోతురాజ్‌గా అమ్మవారితో ఊరేగి ప్రజలకు నెమలి పింఛాలతో దర్శనమిస్తారు. ఈ సందర్భంగా భక్తులకు సౌకర్యాల ఏర్పాటుపై ఒడిశా–ఆంధ్రా అధికారులు సంయుక్తంగా సమావేశమయ్యారు. మార్చి 3న ఆంధ్రాలోని పొల్లేరు గ్రామం నుంచి నదీ స్నానం అనంతరం దేవతలు నౌకా విహారంతో ఒడిశాకు వస్తారు. ఆంధ్రా, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ నుంచే కాకుండా తెలంగాణ నుంచి కూడా భక్తులు వస్తుంటారు.

కలిమెల సమితిలో ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ ప్రారంభం



నూతన ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్



ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌ను ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ ఆశీష్ ఈశ్వర్ పటేల్

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కలిమెల సమితి కేంద్రంలోని పూసుగూఢ పెట్రోల్ బంక్ సమీపంలో ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌ను జిల్లా కలెక్టర్ ఆశీష్ ఈశ్వర్ పటేల్ బుధవారం ప్రారంభించారు. కలిమెల సమితిలో ఎక్సైజ్ కేసులు పెరుగుపోతున్నాయి. అక్రమ మద్యం వ్యాపారం, కిరాణా దూకాణాల్లో విదేశీ మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. వీటిని అరికట్టేందుకు ఈ స్టేషన్ ఇకపై ఉపయోగపడుతోందని కలెక్టర్ అన్నారు. ప్రారంభ కార్యక్రమంలో జిల్లా ఎక్సైజ్ అధికారి బింబేధర్ పండా, కలిమెల బీడీవో ప్రదీప్ కుమార్ కోర, జిల్లా ప్రధాన అభివృద్ధి, నిర్మాణాధికారి నరేష్ చంద్రశభర పాల్గొన్నారు.



ఉన్నతాధికారులతో సిబ్బంది

పిల్లలకు పునరావాసం



చిన్నారులను ప్రభుత్వ ఆశ్రమ కేంద్రానికి తరలిస్తున్న అధికారులు

- భర్త చేతిలో భార్య హతం
- రోడ్డున పడ్డ నలుగురు చిన్నారులు
- పునరావాసం కల్పించిన అధికారులు

కొరాపుట్: మద్యం మత్తులో ఓ వ్యక్తి భార్యను హత్య చేసి జైలు పాలు కాగా వారి నలుగురు చిన్నారులు దిక్కులేనివారయ్యారు. గత నెలలో కొరాపుట్ జిల్లా బందుగాం సమితి గరిడి పంచాయతీలోని దింబగుడ గ్రామంలో రంజన్ కులసిక మద్యం మత్తులో తన భార్యని హత్య చేశాడు. పోలీసులు అతడిని అరెస్ట్ చేసి జైలుకి తరలించారు. అంతవరకు చట్టం తన పని తాను చేసుకుపోయింది. కానీ ఆ దంపతుల నలుగురు పిల్లలు మాత్రం రోడ్డు పడ్డారు. తినడానికి తిండి లేక అలమటించిపోయారు. పిల్లలకు న్యాయం చేయాల్సిన అధికారులు వీరిని పట్టించు కోలేదు. దాంతో గ్రామస్తులే వీరికి అన్నం పెట్టారు. అదే సమయంలో గ్రామానికి వచ్చిన బీడీఓకి చిన్నారుల సమస్యను గిరిజనులు వివరించారు. వీరికి సహాయం చేస్తామని హామీ ఇచ్చిన బీడీఓ కానరాలేదు. పిల్లల పరిస్థితి అత్యంత దయనీయంగా తయారైంది. ఈ విషయం మీడియాలోనూ ప్రసారమైంది. ఇది చూసిన సత్యసాయి సేవా సమితి సభ్యులు బుధవారం ఆ గ్రామానికి చేరుకుని పిల్లలను తామ పోషిస్తామని ముందుకు వచ్చారు. ఈ విషయం దావానలంలా వ్యాపించడంతో కొరాపుట్ జిల్లా శిశు సంక్షేమ శాఖా అధికారులు హుటాహుటిన ఆ గ్రామం చేరుకుని చిన్నారులను ప్రభుత్వ ఆశ్రమ కేంద్రానికి తరలించారు. చిన్నారులు అధికారుల వెంట వెళ్తున్నప్పుడు ఆ గ్రామ గిరిజనులకు కృతజ్ఞతగా చేతులు ఊపుతూ ముందుకు సాగారు. ఆ దృశ్యం గ్రామస్తులందరికీ కన్నీళ్లు తెప్పించింది.

రేపటి నుంచి మెట్రిక్ పరీక్షలు

- కొరాపుట్ జిల్లానుంచి హాజరుకానున్న 16,218 మంది విద్యార్థులు



పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థినులు

జయపురం: ఒడిశా రాష్ట్రంలో ఈ నెల 21వ తేదీ నుంచి మెట్రిక్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ పరీక్షలకు కొరాపుట్ జిల్లాలో 16 వేల 218 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉంది. వీరిలో 16,137 మంది రెగ్యులర్, 67 మంది ఎక్స్ రెగ్యులర్ విద్యార్థులు కాగా మరో 15 మంది మాధ్యమ పాఠ్యక్రమంలో పరీక్షలు రాస్తారని జయపురం సెకెండరీ బోర్డు కార్యాలయం అధికారులు తెలిపారు. జయపురం నోడల్ సెంటర్ ఆధీనంలో జయపురం పట్టణంలో ఐదు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల్లో 1244 మంది రెగ్యులర్, పది మంది ఎక్స్ రెగ్యులర్ పిల్లలు పరీక్షలు రాయాల్సి ఉంటుంది. ఆ కేంద్రాల్లో ఒకటైన ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 326 మంది రెగ్యులర్, నలుగు ఎక్స్ రెగ్యులర్ విద్యార్థులు, ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలో 265 మంది, మున్సిపల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 152 మంది రెగ్యులర్, స్థానిక సిటీ ఉన్నత పాఠశాలలో 155 మంది రెగ్యులర్, ఒక ఎక్స్ రెగ్యులర్, బరిణిపుట్ ఉన్నత పాఠశాల కేంద్రంలో 195 మంది రెగ్యులర్, నలుగురు ఎక్స్ రెగ్యులర్ పరీక్షలు రాస్తారు. అలాగే అంబాగుడ ఉన్నత పాఠశాలలో 236 మంది రెగ్యులర్ హరడాపుట్ ఉన్నత పాఠశాలలో 268 మంది రెగ్యులర్, ఒక ఎక్స్ రెగ్యులర్, పంపుణీ ఉన్నత పాఠశాలలో 194 మంది రెగ్యులర్, ముక్త గ్రామ ఉన్నత పాఠశాలలో 15 మంది పరీక్షలకు హాజరు కావాల్సి ఉంది. 21వ తేదీ నుంచి ప్రారంభం కానున్న పరీక్షలు సజావుగా జరిగేందుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేపట్టినట్లు జయపురం సెకెండరీ బోర్డు అధికారులు వెల్లడించారు. కాగా ప్రశ్న పత్రాలు ఇప్పటికే జయపురం చేరాయి. వాటిని అత్యంత భద్రత మధ్య 21వ తేదీ ఉదయం అన్ని కేంద్రాలకు చేర్చనున్నట్లు మాధ్యమిక విద్యా పరిషత్ కొరాపుట్ జోన్ అధికారి శంకర నాయిక్ వెల్లడించారు. పరీక్షల్లో అవకతవకలు జరగకుండా అన్ని కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి.. కంట్రోలు రూంతో అనుసందానం చేశామన్నారు.

క్లుప్తంగా

బీజేపీ జిల్లా అధ్యక్షునికి ఘన స్వాగతం


గోపీని అభినందిస్తున్న కొండబాబు

రాయగడ: బీజేపీ జిల్లా అధ్యక్షునిగా నియమితులైన న్యాయవాది ఎం.గోపి ఆనంద్‌కు ఆ పార్టీ కార్యకర్తలు, నాయకులు ఘన స్వాగతం పలికారు. అధ్యక్షునిగా నియమితులైన గోపి పూరి జగన్నాథుని దర్శించుకుని మంగళవారం సాయంత్రం తిరిగి రాయగడకు వస్తున్న సమయంలో రామనగుడ, గుమడ,అమలా భట్ట ప్రాంతాల్లో బీజేపీ కార్యకర్తలు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం రాయగడకు చేరుకున్న ఆయనకు స్థానిక సర్క్యూట్ హౌస్ వద్ద బీజేపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో స్వాగతం పలికారు. బాణాసంచా కాల్చి ఆనందం పంచుకున్నారు.

బర్డ్ ఫ్లూ భయం లేదు


వెలవెలబోతున్న చికెన్ సెంటర్లు

రాయగడ: జిల్లాలో బర్డ్ ఫ్లూ భయం లేదని జిల్లా ముఖ్య పశు వైద్య శాఖ అధికారి డాక్టర్ దేవరాజ్ నాయక్ స్పష్టం చేశారు. పొరుగు రాష్ట్రంలో బర్డ్ ఫ్లూ వ్యాపించదన్న వదంతులు రావడంతో జిల్లాలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఆంధ్రా నుంచి అత్యధిక శాతం బాయిలర్ కోళ్లు దిగుమతి అవుతున్నాయని, దీంతో అప్రమత్తమై ప్రతీ పౌల్ట్రీలో కోళ్లను పరీక్షిస్తున్నామని తెలిపారు. ఇంతవరకు అలాంటి వ్యాధి లక్షణాలు కనిపించలేదని చెప్పారు. అయితే ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని, అధిక శాతం బాయిలర్ చికెన్ని వినియోగించకపోవడమే మంచిదని అన్నారు. బర్డ్ ఫ్లూ వ్యాపించిందన్న వచ్చిన వదంతులతో స్థానిక చికెన్ సెంటర్లు వెలవెలబోతున్నాయి.

ధాన్యం లోడ్‌తో ట్రాక్టర్ బోల్తా


బోల్తాపడిన ధాన్యం లోడ్ ట్రాక్టర్

మల్కన్‌గిరి: జిల్లా కలిమెల సమితి బేజాంగ్‌వాడ పంచాయతీ ఎంపివి 71 గ్రామం ముఖ్య రహదారిలో బుధవారం ధాన్యం లోడుతో ట్రాక్టర్ బోల్తా పడింది. ఈ రహదారిపై రోజు వందలాది మంది గిరిజనులు నిత్యావసరాలకు వస్తుంటారు వంతెన పాడవడంతో 5 కిలో మీటర్లు దూరం చుట్టూ తిరిగి వెళ్లాలి. పలుసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు

ఉగాది పురస్కారాల కవితా సంపుటాలకు ఆహ్వానం

శ్రీకాకుళం కల్చరల్: వేమన కవితా నిలయం(శ్రీకాకుళం), తపస్వి మనోహరం (హైదరాబాద్) సంయుక్త నిర్వహణలో ఉగాది సందర్భంగా సాహితీ పురస్కార సభ ఏర్పాటు చేస్తున్నట్లు మహ్మద్ రఫీ, తపస్వీ మనోహరం అధినేత నిమ్మగడ్డ కార్తీక్, బుర్రి కుమారరాజు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో విశ్వావసు నామ ఉగాది సందర్భంగా మార్చి 23న జరిగే ఈ సభ కోసం ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన కవులు 2023 ఏడాదిలో ముద్రణ జరిగిన కవితా సంపుటి రెండు ప్రతులను మార్చి 15లోగా పంపించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఎంపికైన మూడు పుస్తకాలకు రూ.2వేలు చొప్పున మొత్తం రూ.6వేలు నగదు బహుమతులు అందిస్తామని తెలిపారు. సభకు హాజరైన వారికి సత్కారం ఉంటుందని పేర్కొన్నారు. కవితా సంపుటాలను పోస్టు లేదా కొరియర్ ద్వారా మహ్మద్ రఫీ (ఈవేమన), ఎస్–1 శారదా అపార్టుమెంట్, లక్ష్మీనగర్, రణస్థలం, శ్రీకాకుళం జిల్లా 532407 చిరునామాకు పంపించాలని కోరారు.

భారీగా గంజాయి స్వాధీనం

జయపురం: జయపురం సబ్ డివిజన్ బొయిపరిగుడ సమితి మావోయిస్టు నక్సల్ ప్రభావిత ప్రాంతం జి.మరిఖిగుడ గ్రామ పంచాయతీ కొటరగుడ సమీప అడవిలో 578 కేజీల గంజాయిని కనుగొన్నట్లు బొయిపరిగుడ పోలీసు అధికారి దీపాంజలీ ప్రధాన్ బుధవారం వెల్లడించారు. మంగళవారం కొటరగుడ అడవిలో 25 బస్తాలు ఒక చోట పేర్చి ఉండటాన్ని గుర్తించినట్లు బొయిపరిగుడ పోలీసు అధికారి దీపాంజలీ ప్రదాన్ తెలిపారు. గంజాయి బస్తాలను పోలీసు స్టేషన్‌కు తీసుకువెళ్లి మెజిస్ట్రేట్ సమక్షంలో తూకం వేసినట్లు పోలీసు అధికారి వెల్లడించారు. ఈ ఘటనపై దర్యాప్తు జరుపుతున్నామన్నారు.


జయపురం: కొటరగుడ అడవిలో పట్టుబడిన గంజాయి బస్తాలు

రాయగడ జిల్లాలో..

జిల్లాలోని గుణుపూర్, పద్మపూర్ ప్రాంతాల్లో మంగళవారం పోలీసులు నిర్వహించిన దాడుల్లో భారీ ఎత్తున గంజాయి పట్టుబడింది. జిల్లా పోలీస్ కార్యాలయం అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం .. గుణుపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గల కుర్లిం ప్రాంతంలో గంజాయి అక్రమ రవాణా జరుగుతున్నట్లు అందిన సమాచారం మేరకు పోలీసులు కుర్లిం రహదారి వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు బొలేరోను ఆపి తనిఖీ చేయగా అందులో 630 కిలోల గంజాయి పట్టుబడింది. పట్టుబడిన వ్యక్తి గజపతి జిల్లాలోని బిరికొట్ ప్రాంతానికి చెందిన జయంత్ బెహరాగా పోలీసులు గుర్తించారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.10 లక్షల ఉంటుందని అంచనా వేసారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని బుధవారం కోర్టుకు తరలించారు.

పద్మపూర్‌లో..

పద్మపూర్‌లో బుధవారం నిర్వహించిన దాడుల్లో భాగంగా బడపల్లి అటవీ ప్రాంతంలో గంజాయి అక్రమ రవాణా చేస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు పోలీసులు దాడి చేశారు. 40 కిలోల గంజాయి పట్టుబడింది. పోలీసులు రాకను పసిగట్టిన గంజాయి అక్రమ రవాణా దారులు అక్కడి నుంచి పరారైనట్లు సమాచారం.


రాయగడ: గుణుపూర్ పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయితో నిందితుడు


రాయగడ: పద్మపూర్ పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి

మద్యం దుకాణాలను తరలించాలని వినతి

రాయగడ: పట్టణంలోని మూడు విదేశీ మద్యం దుకాణాలను వేరేచోటకు తరలించాలని, లేదంటే ఆందోళన చేపడతామని వికాస్ మంచ్ డిమాండ్ చేసింది. జిల్లా అబ్కారీశాఖ అధికారికి మంచ్ వికాస్ సభ్యులు బుధవారం వినతిపత్రం అందించారు. పట్టణంలోని 3, 11, 15 నంబర్లతో చెలామణి అవుతున్న మద్యం దుకాణాల వల్ల ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. జనావాసాల్లో గల ఈ దుకాణాలను వేరే ప్రాంతాలకు తరలించాలని గత నెల 8న సంబంధిత శాఖ అధికారి దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకపోయిందన్నారు. ఇప్పటికైనా సమస్యను పరిష్కరించకపోతే అబ్కారీ కార్యాలయం ఎదుట ఆందోళన చేపడతామని హెచ్చరించారు. రాయగడ జిల్లా వికాస్ మంచ్ అధ్యక్షుడు దయానంద ఖడంగ, సభ్యులు మనోజ్ సాహు, రాజు నాయక్, తదితరులు ఉన్నారు.


అబ్కారీ శాఖ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న వికాస్ మంచ్ సభ్యులు

హరిపురంలో వేంకటేశ్వర మందిర ప్రతిష్ట


పూజల్లో భక్తులు

పర్లాకిమిడి: కాశీనగర్ సమితి ఖండవ గ్రామ పంచాయితీ హరిపురం గ్రామంలో వేంకటేశ్వరస్వామి మందిర ప్రతిష్ఠా మహోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కోడూరు నారాయణరావు, రోక్కం సతీష్, రామచంద్రుడు, జ్యోతి, అధికసంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేశారు. ప్రతిష్టలో భాగంగా యజ్ఞపూజలు జరిగాయి.

బాల్య వివాహం నిలిపివేత


అధికారుల వాహనాలను చుట్టుముట్టిన గిరిజనులు

కొరాపుట్: జిల్లాలోని సిమిలిగుడ పంచాయతీ మాలిమారువ గ్రామంలో అధికారులు బుధవారం ఓ వివాహ వేడుక జరుగుతోంది. ఊరంతా పండగ వాతావరణం నెలకొంది. భారీ విందు భోజనాలు జరుగుతున్నాయి. కొన్ని క్షణాల్లో పెళ్లి జరగనుంది. సరిగ్గా అదే సమయంలో కొరాపుట్ జిల్లా బాలల సంరక్షణ అధికారిణి రాజశ్రీ దాస్ అక్కడకు పోలీసులతో వెళ్లారు. జరుగుతున్నది బాల్య వివాహమని ఫిర్యాదు రావడంతో.. బాలిక వయసు ధ్రువీకరణ పత్రాలు పరిశీలించి పెళ్లి ఆపాలని సూచించారు. దీంతో గిరిజనులు అధికారుల వాహనాలను చుట్టుముట్టారు. వారిని నచ్చజెప్పి ఇరువర్గాలను కొరాపుట్ తరలించారు. అనంతరం బాలికని శిశు సంక్షేమ వసతి గృహానికి తరలించారు.

గంజాయి నేరగాళ్లపై ఉక్కుపాదం

శ్రీకాకుళం క్రైమ్ : గంజాయి అక్రమ రవాణాకు పాల్పడేవారిని, క్రయవిక్రయాలు జరిపేవారిని, సేవించేవారిని గుర్తించి ప్రత్యేక షీట్లు తెరవాలని విశాఖ రేంజ్ డీఐజీ గోపినాథ్ జెట్టి ఆదేశించారు. రేంజ్ పరిధిలోని జిల్లాల ఎస్పీలు, ఇతర అధికారులతో బుధవారం వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. గంజాయి నియంత్రణ, ప్రజా సమస్యల పరిష్కార వేదిక, నాన్‌బెయిల్‌బుల్ వారెంట్ అమలు, సైబర్ నేరాలు, మహిళలపై జరుగుతున్న నేరాలు, పోక్సో కేసులపై సమీక్షించారు. గంజాయి ద్వారా ఆదాయం ఆర్జించే వారి ఆస్తుల స్వాధీనం చేసుకోవడంతో పాటు పీడీ యాక్టు పెట్టేలా పురోగతి చూపాలన్నారు. హిట్ అండ్ రన్ కేసుల్లో బాధితులకు పరిహారం అందేలా చొరవతీసుకోవాలన్నారు. రోడ్డు భద్రతా నియమాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు ఆమోదయోగ్యంగా బడ్జెట్

శ్రీకాకుళం న్యూకాలనీ: అన్ని వర్గాల ప్రజలకు ఆమోదయోగ్యంగా ఉండేలా కేంద్ర ప్రభుత్వం ఇటీవల బడ్జెట్ పెట్టిందని విశాఖపట్నం నార్త్ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెన్మత్స విష్ణుకుమార్‌రాజు పేర్కొన్నారు. బుధవారం బీజేపీ శ్రీకాకుళం జిల్లా శాఖ అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వరరావు అధ్యక్షతన జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాలులో ఇటీవల ప్రవేశపెట్టిన ప్రజా బడ్జెట్ 2025–26పై మేధావుల సమావేశం నిర్వహించారు. బడ్జెట్‌లోని ముఖ్య అంశాలపై పలువురు వక్తలు చర్చించారు. కార్యక్రమంలో డాక్టర్ కె.అమ్మన్నాయుడు, చార్టర్డ్ అకౌంటెంట్ ఐ.కె.రావు, రిటైర్డ్ జడ్జి పప్పల జగన్నాథం, అంబేడ్కర్ యూనివర్సిటీ విశ్రాంత రిజిస్ట్రార్ ప్రొఫెసర్ గుంట తులసీరావు, కంపెనీ సెక్రటరీ బుర్రా భార్గవ్, విద్యావేత్త నిక్కు అప్పన్న, ఎన్‌జీవో మణిశర్మ, గురజాడ విద్యాసంస్థల ప్రతినిధి సంయుక్త, విద్యావేత్త జామి భీమశంకర్, జర్నలిస్టు సంఘ నాయకుడు కొంక్యాణ వేణుగోపాల్, డాక్టర్ పైడి సింధూర, బీజేపీ నాయకులు పూడి తిరుపతిరావు, పైడి వేణుగోపాలం, కరుణాకరరావు, నరేంద్రచక్రవర్తి, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

కష్టార్జితం కాలిపోయింది..

- షార్ట్ సర్క్యూట్‌తో షాపు దగ్ధం
- కాలి బూడిదైన రూ.3 లక్షల నగదు


కాలిపోయిన నగదును చూపిస్తున్న బాధితుడు

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని తేలుకుంచి గ్రామంలో బుధవారం షార్ట్ సర్క్యూట్ సంభవించడంతో కిరాణా షాపు దగ్ధమైంది. కష్టపడి దాచుకున్న సొమ్ము కాలిపోవడంతో బాధితులు లబోదిబోమంటున్నారు. వివరాల్లోకి వెళ్తే.. గుడియా బిమ్మో ఇంట్లోనే కిరాణా షాపు నిర్వహిస్తున్నాడు. బుధవారం వేకువజాము ఐదు గంటల ప్రాంతంలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో కుటుంబ సభ్యులు బయటకు పరుగులు తీశారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అప్పటికే అత్తమ్మ వైద్యం కోసం పెట్టెలో భద్రపరిచిన మూడు లక్షల రూపాయల నగదు కాలిపోయాయి. రెండు ఫ్రిజ్‌లు, కిరాణా సామాన్లు అగ్నికి ఆహుతయ్యాయి. సుమారు మూడున్నర లక్షల రూపాయల సామాన్లు కాలిపోయినట్లు అగ్నిమాపకాధికారులు కె.ప్రశాంత్, సూర్యారావు తెలిపారు. బాధిత కుటుంబాన్ని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్, సర్పంచ్ పాతిర్ల రాజశేఖరరెడ్డి పరామర్శించారు.

గుర్తు తెలియని మృతదేహం కలకలం

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా కేంద్రంలోని హయాతినగరం సమీపంలో నాగావళి నదీ తీరంలో బుధవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కలకలం రేపింది. వ్యక్తి ఎడమ చేతి భుజంపై మహిళ బొమ్మ, డి.లక్ష్మి అనే అక్షరాలు పచ్చబొట్టుగా వేసి ఉన్నాయని ఒకటో పట్టణ ఎస్ఐ హరికృష్ణ తెలిపారు. బాగా కుళ్లిన స్థితిలో ఉండటంతో సుమారు ఐదు రోజులు కిందట వ్యక్తి చనిపోయి ఉంటాడని, వయసు 35 నుంచి 40 ఏళ్ల మధ్య ఉంటుందని భావిస్తున్నామన్నారు. స్థానిక వీఆర్వో ఇచ్చిన సమాచారం మేరకు ఘటనా స్థలిని పరిశీలించామని, పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించామని చెప్పారు. వివరాలు తెలిస్తే ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో తెలియజేయవచ్చన్నారు.

విద్యార్థిని ఆత్మహత్య

కాశీబుగ్గ: మందస మండలం లోహరిబంద గ్రామంలో ఎనిమిదో తరగతి విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కర్రి అనూష (14) లోహరిబంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. బుధవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఎవరికీ చెప్పకుండా ఇంటికి వెళ్లిపోయింది. ఏం జరిగిందో గానీ ఇంటి పక్కనున్న తోటలో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. విద్యార్థిని వెతుక్కుంటూ వెళ్లిన ఉపాధ్యాయులు చెట్టుకు వేలాడటం చూసి నిర్ఘాంతపోయారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది. మందస పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిందితుడు అరెస్టు


నిందితుడు లక్ష్మణ గౌడ

జయపురం: ఒక బాలికపై లైంగిక దాడి ఆరోపణలతో జయపురం మహిళా పోలీసులు ఒక యువకుడిని అరెస్టు చేశారు. జయపురం సబ్‌డివిజన్ బొరిగుమ్మ డాబుగుడ గ్రామానికి చెందిన లక్ష్మణ గౌడ(18)ని అరెస్టు చేశామని మహిళా పోలీసు స్టేషన్ ఇన్‌చార్జ్ ఈశ్వర తండి బుధవారం వెల్లడించారు. ఈనెల 13వ తేదీ రాత్రి బాలిక బహిర్భూమి కోసం బయటకు వెళ్లగా.. అక్కడే ఉన్న లక్ష్మణ గౌడ బాలికను ఎత్తుకుపోయి అఘాయిత్యం చేసేందుకు ప్రయత్నించాడు. ఈ విషయం ఎవరికి తెలిపినా చంపుతానని బాలికను హెచ్చరించాడు. బాలిక కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి అతడిని పట్టుకుని దేహశుద్ధి చేశారు. మరుసటి రోజు యువకుడి గ్రామానికి చెందిన వారు కర్రలు, గొడ్డళ్లు పట్టుకుని బాధితురాలి గ్రామంపై దాడి చేసి లక్ష్మణ గౌడను విడిపించుకుని వెళ్లిపోయారు. దీంతో బాధితురాలి కుటుంబసభ్యులు పోలీసులను ఆశ్రయించి జరిగిన సంఘటనపై ఫిర్యాదు చేశారు. బాలికను ఆస్పత్రిలో పరీక్షించి ఆమె స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. అనంతరం నిందితుడు లక్ష్మణ గౌడను అరెస్టు చేశారు.

ఒడిశాలో హత్య.. పీఎంపాలెంలో నిందితుల అరెస్ట్

పీఎంపాలెం: ఒడిశా రాష్ట్రంలోని సుందర్‌గఢ్ జిల్లా రాజ్‌గంగ్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఓ హత్య కేసులో నిందితులుగా ఉన్న ఇద్దరిని బుధవారం పీఎంపాలెం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇందుకు సంబంధించి సీఐ బాలకృష్ణ తెలిపిన వివరాలివీ.. ఒడిశాకు చెందిన సుజిత్ బెంగ్రా, మున్నా సన్యాసి ఓ హత్య చేసిన కేసులో ప్రధాన నిందితులు. పీఎంపాలెం బాబా కాలేజీ ఏరియాలో నిందితుల్లో ఒకరి చెల్లెలు నివసిస్తోంది. ఒడిశా పోలీసుల నుంచి తప్పించుకోవడానికి కొన్ని రోజులుగా నిందితులు ఆమె వద్ద తలదాచుకుంటున్నారు. ఇదిలా ఉండగా ఒడిశా పోలీసులు సెల్ టవర్ లొకేషన్ ఆధారంగా నిందితుల నివాసం గుర్తించారు. స్థానిక పోలీసుల సహకారంతో నిందితులను చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని ఒడిశా తీసుకెళ్లారు.

పర్యావరణ పరిరక్షణపై సైకిల్ యాత్ర


మల్కన్‌గిరి చేరుకున్న శుభం బారిక్

మల్కన్‌గిరి: పర్యావరణ పరిరక్షణపై సంభల్‌పూర్‌కు చెందిన శుభం బారిక్ అనే 21 ఏళ్ల యువకుడు సైకిల్‌పై చేస్తున్న దేశ యాత్ర మంగళవారం రాత్రి మల్కన్‌గిరి జిల్లా మత్తిలి సమితికి బుధవారం చేరింది. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఒక మనిషి–ఒక చెట్టు నినాదంతో ప్రజల్లో అవగహన కల్పించాలనే ఉద్దేశంతో గత ఏడాది డిసెంబర్ 27వ తేదీ సైకిల్ యాత్రకు బయలు దేరిన శుభం బారిక్ జర్సిగూఢ, సందర్‌గూఢ, కేందుజోర్, మయుర్‌బంజ, బాలేశ్వర్, భద్రక్, జాజ్‌పూర్, కేంద్రపోఢ, జగత్సంగ్‌పూర్, కటాక్, పూరీ, ఖుర్దా, నయాగఢ్, గంజామ్, గజపతి, రాయగడ, కోరపుట్ ప్రాంతాల్లో పర్యటించి బుధవారంమల్కన్‌గిరి జిల్లాకు చేరుకున్నారు. మత్తిలి పోలీసులు ఆయనకు స్వాగతం పలికి బస ఏర్పాటు చేశారు. మల్కన్‌గిరి ఉత్కళ విలేకర్ల సంఘం సభ్యులు కూడా అభినందించారు.

వన్య ప్రాణులను కాపాడారు


టికరపడలో అడవి పందులను గుర్తించిన అటవీ శాఖ అధికారులు

జయపురం: వన్య ప్రాణుల రక్షణకు దృష్టి సారించింది బొయిపరిగుడ అటవీ సిబ్బంది. అడవుల్లో వన్య ప్రాణులను వేటాడే ఆట కట్టించేందుకు అటవీ సిబ్బంది పెట్రోలింగ్ జరిపింది. మంగళవారం రాత్రి బొయిపరిగుడ సమితి టికరపడలో కొంతమంది మూడు అడవి పందులను పట్టుకొని గ్రామానికి తీసుకువెళ్లారని, వాటిని బుధవారం చంపి మాంసం అమ్మేందుకు యోచిస్తున్నారని విశ్వాసనీయ వర్గాల ద్వారా బొయిపరిగుడ సమితి దసంతపూర్ అటవీ అధికారి రంజితా నాయక్‌కు సమాచారం అందింది. రంజితా నాయక్ ఆధ్వర్యంలో ఓ బృందం టికరపడ గ్రామానికి వెళ్లింది. గ్రామంలో ఒకచోట మూడు అడవి పందులు బంధించి ఉంచడాన్ని గుర్తించారు. వాటిని రక్షించి బొయిపరిగుడ అటవీ విభాగ కార్యాలయానికి తీసుకువచ్చారు. అడవి పందులను బుధవారం వైద్య పరీక్షలు చేపట్టిన అనంతరం అడవిలో విడిచి పెట్టనున్నట్లు రంజితా నాయక్ వెల్లడించారు. మూడు అడవి పందులను పట్టి ఉంచిన వారిని కనుగొని తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

కొఠియాలో కమ్యూనిస్టు నాయకుల పర్యటన


కొఠియాలో పర్యటిస్తున్న సాలూరు సీపీఎం నాయకులు

కొరాపుట్: ఆంధ్రా–ఒడిశా వివాదాస్పద ప్రాంతం కొఠియాలో ఆంధ్రప్రదేశ్‌కి చెందిన కమ్యూనిస్టు నాయకులు పర్యటించారు. బుధవారం కొరాపుట్ జిల్లా పొట్టంగి సమితి కొఠియా గ్రామ పంచాయతీ దిగువ శెంబి, ఎగువ శెంబి, ధూళి భద్ర గ్రామాల్లో మన్యం పార్వతీపురం జిల్లా సాలూరు మండలం సీపీఎం కమిటీ ఆధ్వర్యంలో పర్యటనలు జరిగాయి. ఈ పర్యటనలో సీపీఎం జిల్లా కార్యదర్శి గంగ నాయుడు మాట్లాడుతూ స్వాతంత్య్రం వచ్చిన నాటి నుంచి ఈ సమస్య పరిష్కారం చేయడంలో ఇరు రాష్ట్రాల ప్రభుత్వాలు విఫలం అయ్యాయన్నారు. ఈ సమస్య పై ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి చొరవ తీసుకొని ఇరు రాష్ట్రాల మధ్య సమావేశం నిర్వహించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా చర్యలు తీసుకోవాలన్నారు. ఇరు రాష్ట్రాలు ఇక్కడ అభివృద్ధిలో పోటీ పడాలే గానీ గిరిజనులను ఇబ్బంది పెట్టకూడదని తెలిపారు. పర్యటనలో ఆ పార్టీ నాయకులు ఎన్‌వై నాయుడు, కోరాడ ఈశ్వర రావు, మర్రి శ్రీనివాసరావు, తాడంగి సన్నం, సీతయ్య కొంబులు, చోడిపల్లి బీరుసు, చరణ్ మర్రి మహేష్, కునేటి సుబ్బా తదితరులు పాల్గొన్నారు.


గిరిజనులతో సమావేశమైన కమ్యూనిస్టు నాయకులు

ఛత్రపతి శివాజీకి ఘన నివాళులు


శివాజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న యువకులు


మజ్జిగను పంపిణీ చేస్తున్న భజరంగ దళ్ కార్యకర్తలు

రాయగడ: ఛత్రపతి శివాజీ 395 జయంతోత్సవాలను పట్టణంలోని పలు ప్రాంతాల్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక కపిలాస్ కూడలి వద్ద బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఛత్రపతి సేవలను ఈ సందర్భంగా వక్తలు గుర్తు చేశారు. కపిలాస్ కూడలి బస్ స్టాప్ వద్ద పాదచారులకు మజ్జిగ వితరణ చేశారు. భజరంగ్‌దళ్‌కు చెందిన అయజ్ కుమార్ ఆగ్రాణి, గోపీనాథ బ్రహ్మ, శ్యామజ్యోతి బెహర తదితరుల నేతృత్వంలో ఉత్సవాలు జరిగాయి.

రైతులకు ఉపయోగపడేలా శిక్షణ

ఆమదాలవలస: రైతులకు ఉపయోగపడేలా యువతకు వృత్తి నైపుణ్యంలో శిక్షణ తరగతులు నిర్వహించాలని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ఎక్స్‌టెన్షన్ డాక్టర్ బి.ముకుంద రావు సూచించారు. ఆమదాలవలసలోని కృషివిజ్ఞాన కేంద్రంలో బుధవారం కె.వి.కె. ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ సీహెచ్ ముకుందరావు అధ్యక్షతన 43వ శాస్త్రీయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025– 26 సంవత్సరంలో చేయాల్సిన పరిశీలన క్షేత్రాలు, ప్రదర్శన క్షేత్రాలపై దిశా నిర్దేశం చేశారు. నైరా వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.భరత లక్ష్మి, కె.వి.కె. సమన్వయకర్త డాక్టర్ కె. భాగ్యలక్ష్మి, జిల్లా వ్యవసాయాధికారి త్రినాథ స్వామి, జిల్లా మత్స్య అధికారి డాక్టర్ పి.శ్రీనివాస్, ఏపీ ఎంఐపీ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాస్, యానిమల్ హస్బెండ్రీ అసిస్టెంట్ డైరెక్టర్ ఆనంద్‌రావు వివిధ అంశాలపై ప్రసంగించారు.

పాకలు పీకేశారు..!

- మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడించిన పారిశుధ్య కార్మికులు
- భారీగా పోలీసుల మోహరింపు



కార్మికులను ఈడ్చుకెళ్తున్న పోలీసులు

బొబ్బిలి: పట్టణంలోని 29వ వార్డు పాకీవీధి సమీపంలో 1.40ఎకరాల స్థలాన్ని పారిశుధ్య కార్మికులకు కేటాయించాలని గత పాలకులు ఇచ్చిన హామీ మేరకు అందులో తాత్కాలికంగా వారు వేసుకున్న పాకలను మున్సిపల్ అధికారులు, పోలీసులు రెండు పొక్లెయిన్లతో తొలగించారు. బుధవారం జరిగిన ఈ సంఘటన ఉద్రిక్తతకు దారి తీసింది. ఉదయం పారిశుధ్య కార్మికులు ఇళ్ల వద్ద లేని సమయంలో పాకలు తొలగించడానికి వచ్చిన అధికారులు, పోలీసులను మహిళలు అడ్డుకున్నా వెరవకుండా తొలగించారు. ఆ సమయంలో విషయం తెలుసుకున్న కార్మికులు, సంఘం నాయకులు అంతా ఒక చోట చేరి మున్సిపల్ కార్యాలయం ముట్టడికి పిలుపునివ్వడంతో కార్యాలయ ప్రాంతాన్ని పోలీసులు పూర్తిగా ఆక్రమించి మోహరించారు. దీంతో ఉదయం నుంచి మధ్యాహ్నం రెండున్నర గంటల వరకూ మున్సిపల్ కార్యాలయం వద్ద ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. మధ్యాహ్నం ఒంటి గంటన్నర తరువాత కార్మికులు మున్సిపల్ కార్యాలయానికి చేరుకుని నినాదాలు చేశారు. పారిశుధ్య కార్మికులకు కేటాయించిన స్థలం కోసం 1991లోనే మున్సిపల్ కార్యాలయానికి రుసుము చెల్లించామని ఆ రశీదులు తమ వద్దే ఉన్నాయని చెప్పారు. ఆ సమయంలో మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి, సీఐలు కె. సతీష్ కుమార్, నారాయణరావు, ఎస్సై ఆర్.రమేష్‌ల సమక్షంలో చర్చలు జరిగాయి. ఈ చర్చల్లో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగియగానే మీకు స్థలాలు వచ్చేలా చర్యలు తీసుకుంటామని, లేకుంటే ఆ పార్టీలోనే ఉండబోనని టీడీపీ నాయకుడు కాకల వెంకటరావు కార్మికులకు చెప్పడం విశేషం. ఈ సందర్భంగా కార్మికులు మెమొరాండం సమర్పించగా మున్సిపల్ ఉన్నతాధికారుల లేఖను కార్మికులకు వారు అప్పగించారు. అక్కడ నిర్మించిన పాకలను వెంటనే తొలగించాలని పోలీసులు, అధికారులు కోరారు. పాకలను తొలగించే వరకూ సరేనని, కానీ అక్కడున్న కర్రలను తొలగించేది లేదని చెప్పడంతో మళ్లీ కథ మొదటికొచ్చింది. ఆ స్థలంలో కర్రలను తొలగించకపోతే మీపై కేసులు నమోదు చేస్తామని, అరెస్టులుంటాయని హెచ్చరించడంతో కాసేపు తోపులాట జరిగింది. దీంతో మరింత ఉద్రిక్త పరిస్థితులు సంభవించాయి.

ఆరుగురి అరెస్ట్ కేసుల నమోదు

ఆ సమయంలో కోపోద్రిక్తులైన పోలీసులు ఆరుగురు కార్మిక సంఘం నాయకులు పొట్నూరు శంకరరావు, బంగారి యుగంధర్, ఏడుకొండలు, వడ్డాది శంకర రావు, జి.గౌరీశు, బంగారి వెంకటరమణలను పోలీసు వ్యాన్‌లోకి ఎక్కించి స్టేషన్‌కు తీసుకువెళ్లిపోయారు. అక్కడ వారిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ప్రకటించారు. అక్కడి నుంచి సాయంత్రం వరకూ అక్కడే ఉంచి తహసీల్దార్ కార్యాలయానికి తీసుకువెళ్లి అక్కడ వారిపై బైండోవర్ చేశారు. ఇండ్ల స్థలాలను అడిగితే ఇలా అరెస్టులు, కేసులు ఏమిటని కార్మికులు ప్రశ్నించారు. చర్చల్లో టీడీపీ పట్టణ అధ్యక్షుడు రాంబార్కి శ శరత్, కాకల వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.



ఇండ్ల స్థలాల వద్ద పోలీసులు కూల్చేసిన పాకలు

నేటి నుంచి ఆరిపాక బ్రహ్మానందం స్మారక నాటక పోటీలు

- మూడురోజుల పాటు జరగనున్న పోటీలు
- రెండు రాష్ట్రాల నుంచి ఆరు నాటిక బృందాల రాక

నెల్లిమర్ల: కళలకు కాణాచి, కళాకారుల గ్రామం నగర పంచాయతీలోని జరజాపుపేటలో ఈ నెల 20వ తేదీ నుంచి మూడు రోజుల పాటు శ్రీ ఆరిపాక బ్రహ్మానందం స్మారక రెండు తెలుగు రాష్ట్రాల స్థాయి నాటక పోటీలు జరగనున్నాయి. ప్రముఖ నటుడు, కందుకూరి వీరేశలింగం అవార్డు, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత స్వర్గీయ ఆరిపాక బ్రహ్మానందం మాస్టారి పేరిట ఈ నాటక పోటీలను ఆయన కుటుంబీకులు, గ్రామస్తులు నిర్వహిస్తున్నారు. ఈ పోటీలను గురువారం సాయంత్రం 6 గంటలకు ఎంఎల్‌ఏ లోకం నాగమాధవి, ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు లాంఛనంగా ప్రారంభించనున్నారు. సభ అనంతరం నాటిక ప్రదర్శన ప్రారంభం అవుతుంది. తొలిరోజు హైదరాబాద్ కళాంజలి కళాకారులు 'రైతే రాజు' నాటికను తర్వాత కాకినాడ శ్రీ సాయి కార్తీక్ క్రియేషన్స్ కళాకారులు 'ఎడారిలో వాన చినుకు' నాటికను ప్రదర్శిస్తారు. రెండో రోజు శుక్రవారం సాయంత్రం 6 గంటలకు సభా కార్యక్రమానికి లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు, భీశెట్టి బాబ్జీ, ఆంధ్ర యూనివర్సిటీ థియేటర్ ఆర్ట్స్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ వేమలి త్రినాథరావు హాజరు కానున్నారు. రెండో రోజు రాత్రి 7 గంటలకు శ్రీకాకుళం జిల్లా బొరివంకకు చెందిన శార్వాణి గ్రామీణ గిరిజన సాంస్కృతిక సేవా సంఘం కళారారులు 'కొత్త పరిమళం' నాటికను, తర్వాత విజయనగరానికి చెందిన సౌజన్య కళా స్రవంతి (ఉత్తరాంధ్ర) కళాకారులు దేవరాగం నాటిక ప్రదర్శించనున్నారు. మూడో రోజు శనివారం సాయంత్రం 6గంటలకు సభా కార్యక్రమానికి ఎమ్మెల్సీ డాక్టర్ పీవీవీ సూర్యనారాయణరాజు (సురేష్ బాబు), మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు హాజరు కానున్నారు. రాత్రి 7 గంటలకు కరీంనగర్‌కు చెందిన చైతన్య కళాభారతి కళాకారులు 'చీకటి పువ్వు' నాటికను, తర్వాత విశాఖపట్నానికి చెందిన తెలుగు కళాసమితి కళాకారులు 'నిశ్శబ్దమా నీ ఖరీదెంత' నాటికను ప్రదర్శించమన్నారు.

విజేతలకు బహుమతులు

కార్యక్రమంలో భాగంగా రెండో రోజు అతిథుల చేతుల మీదుగా జరజాపు పేటకు చెందిన సీనియర్ కళాకారులను సత్కరించనున్నట్లు పోటీల నిర్వాహక కమిటీ ప్రతినిధులు తెలిపారు. నాటక పోటీల విజేతలకు వరుసగా రూ.8వేలు, రూ. 6వేలు, రూ.4 వేలు నగదు బహుమతులతో పాటు శాశ్వత షీల్డ్ లను అందజేయనున్నట్లు చెప్పారు. ఉత్తమ నటులకు వ్యక్తిగత బహుమతులతో పాటు నగదు పురస్కారాలు అందించనున్నట్లు తెలిపారు. ఈ నాటక పోటీలకు కళాకారులు కళాభిమానులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

వ్యక్తిపై కత్తితో దాడి

దత్తిరాజేరు: మండలంలోని కె.కృష్ణాపురంలో మంగళవారం రాత్రి గ్రామంలో జరుగుతున్న పెళ్లి వద్ద ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన గొడవ కారణంగా గ్రామానికి చెందిన సుమల పైడిపునాయుడికి తీవ్ర గాయాలైనట్లు ఎస్ బూర్జవలస ఎస్సై రాజేష్ బుధవారం తెలిపారు. ఆయన తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. రామభద్రపురం మండలం పాతరేగకు గూడాపు సింహాచలం, గాయాల పాలైన పైడిపునాయుడుల మధ్య ఘర్షణ జరిగింది. అక్కడితో ఆగకుండా గ్రామ శివారుకు స్కూటీపై సింహాచలం వచ్చి పైడిపునాయుడిపై కత్తితో దాడిచేయగా గాయాలపాలవడంతో ముందుగా బాడంగి ఆస్పత్రికి అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం విజయనగరంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా వైద్యం పొందుతున్నాడు. దాడిచేసిన సింహాచలాన్ని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

క్లుప్తంగా

పెద్దల సమక్షంలో మెడికల్ షాపు నిర్వాహకుడి హాజరు



పోలీస్‌స్టేషన్ ఆవరణలో నిడగల్లు బాధితులు

సీతానగరం: మండలంలోని నిడగల్లు గ్రామానికి చెందిన మెడికల్‌షాపు నిర్వాహకుడు తాను చేసిన అప్పులను స్థిరాస్తులు విక్రయించి తీర్చడానికి పెద్దల సమక్షంలో బాధితుల ముందు నిర్ణయించారు. బుధవారం మెడికల్‌షాపు నిర్వాహకుడితో పాటు అప్పులు ఇచ్చిన బాధితులు పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించారు. ఉభయులూ కలిపి పెద్దల సమక్షంలో సీతానగరం పోలీస్టేషన్‌కు చేరుకున్నారు. గ్రామ పెద్దలతో పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన ఉభయ వర్గాల వారుల స్టేషన్ ఆవరణలో పంచాయితీ నిర్వహించారు. మెడికల్‌షాపు నిర్వాహకుడు ఉభయుల శ్రేయస్సు దృష్ట్యా తనకున్న స్థిరాస్థులు విక్రయించి బాధితులకు రుణాన్ని తనకున్నంత మేరకు తీర్చుకుంటానని హామీ ఇవ్వడంతో అందరూ వెనుదిరిగారు.

దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురం: పార్వతీపురం మన్యం జిల్లాలో ఎస్సీ, ఎస్టీ పౌరహక్కుల రక్షణ చట్టం, అత్యాచార నిరోధకర చట్టం జిల్లా విజిలెన్స్, పర్యవేక్షణ కమిటీలో గౌరవ సభ్యులుగా నియామకం చేయనున్నట్లు జిల్లా ఎస్సీ సంక్షేమ సాధికారత అధికారి ఎండి.గయాజుద్దీన్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో అధికార సభ్యులు ముగ్గురు, అనధికార సభ్యులు ఐదుగురు, స్వచ్ఛంద సేవా సభ్యులు ముగ్గురిని నియమించనున్నట్లు పేర్కొన్నారు. అధికార సభ్యులు గ్రూపు 'ఎ' గెజిటెడ్ ఆఫీసర్స్, అనధికార సభ్యులు ఎస్సీ, ఎస్టీ కులాలకు చెందిన వారు, స్వచ్ఛంద సభ్యులు ఇతర కేటగిరిలకు చెందినవారు ఉండాలని స్పష్టం చేశారు. ఆసక్తిగల అభ్యర్థులు పూర్తిచేసిన దరఖాస్తుతో ఎస్సీ సంక్షేమ సాధికారత కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఫోన్ 9492535085 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

వ్యాపార సంస్థలపై లీగల్ మెట్రాలజీ శాఖ దాడులు

- 10 కేసుల నమోదు



వ్యాపార సంస్థలపై దాడులు నిర్వహించి కేసులు రాస్తున్న లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ ఎం.దామోదర నాయుడు

విజయనగరం: విజయనగరం పట్టణంలో, బొండపల్లి మండలంలో వివిధ ప్రాంతాల్లో పలు రకాల వ్యాపార సంస్థలపై లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ ఎం.దామోదర నాయుడు ఆకస్మికంగా బుధవారం తనిఖీలు నిర్వహించారు, ఈ తనిఖీల్లో మొత్తం 10 కేసులు నమోదు చేశారు. వాటిలో తూనిక యంత్రానికి సీళ్ల లేకపోవడం గుర్తించి 3 కేసులు, తూనిక యంత్రాలలో లొసుగులు వినియోగించి తూకంలో మోసం చేసిన వారిపై 4 కేసులు, అదేవిధంగా ప్యాకేజీలపై ముద్రించిన అమ్మకపు ధర కంటే అధికంగా విక్రయించిన వారిపై 3 కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా వ్యాపారస్తులతో ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు నాణ్యమైన సరుకులు తూకంలో గానీ కొలతలో గానీ తేడా లేకుండా విక్రయించాలని, ముద్రించిన ధరకే ప్యాకేజీలు విక్రయించాలని సూచించారు. ఈ తనిఖీల్లో టెక్నికల్ అసిస్టెంట్ సత్యనారాయణ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



బౌరి రాజేంద్ర మృతదేహం

భామిని: మండలంలోని లివిరికి చెందిన బౌరి రాజేంద్ర(32) బుధవారం ఉదయం మరణించాడు. మంగళవారం రాత్రి లివిరి-భామిని మధ్య జరిగిన రోడ్డు ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న బౌరి రాజేంద్ర(32), మరో యువకుడు బౌరి తిరుపతి తీవ్రంగా గాయపడ్డారు. వెనువెంటనే స్థానికుల సహకారంతో బాధితులను భామిని పీహెచ్‌సీకి తీసుకువెళ్లి ప్రాథమిక చికిత్స పొందారు. అనంతరం లివిరి స్వగ్రామానికి తీసుకువెళ్లి ఇద్దరు బాధితులకు ప్రైవేట్ వైద్యం అందించినప్పటికీ గాయపడిన బాధితుడు బౌరి రాజేంద్ర(32) మృత్యువాతపడి ఉండడాన్ని భార్య ఉషారాణి బుధవారం ఉదయం గుర్తించి భోరున విలపిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు బత్తిలి ఏఎస్సై కొండగొర్రి కాంతారావు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం కుటుంబసభ్యులకు మృతదేహం అప్పగించగా లివిరిలో అంతిమ సంస్కారాలు నిర్వహించారు.

ఆశ్రమ పాఠశాలలకు కోడిగుడ్డు కట్

- అంతకు ముందు చికెన్ నిలిపివేత
- బర్డ్ ఫ్లూ నేపథ్యంలో నిర్ణయం

సీతంపేట: బర్డ్ ఫ్లూ నేపథ్యంలో విద్యార్థులకు పోషకాహారం ఎండమావిగా మారుతోంది. కొద్ది రోజుల కిందట అన్ని ఆశ్రమపాఠశాలలు, గురుకులాలు తదితర విద్యాసంస్థల్లో విద్యార్థులకు చికెన్ పెట్టవద్దని ఉత్తర్వులు ఇచ్చారు. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ తాజాగా సీతంపేట ఐటీడీఏ పరిధిలో వివిధ ఆశ్రమపాఠశాలల్లో చదువుతున్న గిరిజన విద్యార్థులకు మెనూలో భాగంగా పోషకాహారం అందివ్వడానికి పెట్టే కోడిగుడ్లు నిలుపుదల చేస్తూ ట్రైబల్ వెల్ఫేర్ అధికారులు ఆదేశించారు. పక్క ఐటీడీఏ పార్వతీపురం పరిధిలో ఉన్న గిరిజన సంక్షేమ ఆశ్రమపాఠశాలల విద్యార్థులకు ఎగ్స్ పెడుతున్నప్పటికీ ఇక్కడ మాత్రం నిలిపివేయడం గమనార్హం. అలాగే మిడ్‌డేమీల్, అంగన్వాడీ కేంద్రాలన్నింటిలో చిన్నారులకు కోడిగుడ్లు ఇస్తున్నప్పటికీ ఆశ్రమపాఠశాలలకు మాత్రమే నిలుపుదల చేయడమేమిటని విద్యార్థుల తల్లిదండ్రులు కొంతమంది ప్రశ్నిస్తున్నారు. మిగతా ఐటీడీఏలలో ఎక్కడా కోడిగుడ్లు నిలుపుదల చేయలేదని స్థానిక గిరిజన సంక్షేమశాఖ పరిధిలో మాత్రమే ఆపివేశారని వాపోతున్నారు. సీతంపేట ట్రైబల్ వెల్ఫేర్ పరిధిలో 47 గిరిజన సంక్షేమ ఆశ్రమపాఠశాలల్లో దాదాపు 12 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. నెలకు ఐటీడీఏ పరిధిలో అన్ని ఆశ్రమపాఠశాలలు, గురుకులాలకు కలిపి మొత్తం 3,70,000 కోడిగుడ్లు అవసరం. ప్రతిరోజూ ఉడికించిన కోడిగుడ్డు (శనివారం మినహాయించి)ఇచ్చేవారు. చికెన్, కోడిగుడ్డు ఉడకబెట్టుకుని తినవచ్చని ప్రభుత్వం ఒక వైపు ప్రచారం చేస్తోంది. చికెన్ ఎలాగూ బర్డ్‌ఫ్లూ భయంతో నిలుపుదల చేశారు. కనీసం ఎగ్ కూడా పెట్టకపోవడమేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

ట్రైబల్ వెల్ఫేర్ డీడీ ఏమన్నారంటే..

ఈ విషయమై గిరిజన సంక్షేమ శాఖ డీడీ అన్నదొర వద్ద సాక్షి ప్రస్తావించగా తుని నుంచి కోడిగుడ్లు సరఫరా చేస్తున్నారని, బర్డ్‌ఫ్లూ వ్యాధి వ్యాప్తి దృష్ట్యా కొద్ది రోజులు నిలిపివేయాలని అన్ని వసతిగృహాలకు ఆదేశాలు ఇచ్చామని తెలిపారు.

అంతర్జాతీయ స్థాయి సాంకేతిక సదస్సు ప్రారంభం



సావనీర్‌ను ఆవిష్కరించిన యూనివర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ డి.రాజ్యలక్ష్మి, తదితరులు

విజయనగరం అర్బన్: జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ) యూనివర్సిటీలో ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో 'ఈసెంట్రా 2కే25' పేరుతో రెండురోజుల పాటు నిర్వహించే అంతర్జాతీయ సదస్సు బుధవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన యూనివర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ డి.రాజ్యలక్ష్మి మాట్లాడుతూ వృత్తి పరమైన నైపుణ్యాలతో ఉన్నత స్థాయికి ఎదుగుతారని విద్యార్థులు ఆదిశగా కళాశాల స్థాయి నుంచి తయారు కావాలని సూచించారు. విశిష్ట అతిథిగా హాజరైన ఎస్ఎస్‌టీఎల్ రిటైర్డ్ సైంటిస్టు బీవీఎస్ఎస్ కృష్ణకుమార్ మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, శాటిలైట్ కమ్యూనికేషన్, సెమీ కండక్టర్స్‌పై నైపుణ్యాలతో ఉద్యోగావకాశాలు అధికమన్నారు. భవిష్యత్‌లో అభివృద్ధికి కీలకంగా నిలుస్తున్న సాంకేతిక పరిజ్ఞానానికి తొలి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అనంతరం సావనీర్‌ను ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ డి.రాజ్యలక్ష్మి ఆవిష్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆర్.రాజేశ్వరరావు, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ టీఎస్ఎన్‌మూర్తి, ప్రొఫెసర్ కె.బాబులు, కేసీబీరావు, డాక్టర్ గురునాథం, డాక్టర్ నీలిమ, డాక్టర్ బి.హేమ, డాక్టర్ జి.అప్పలనాయుడు, జేఎన్‌టీయూ జీవీ యూనివర్సిటీ డైరెక్టర్లు, అధ్యాపకులు, వివిధ కళాశాలల నుంచి హాజరైన 800 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

23న ఉత్తరాంధ్ర స్థాయి చెస్ పోటీలు

విజయనగరం: చెస్ అసోసియేషన్ ఆఫ్ విజయనగరం ఆధ్వర్యంలో ఈనెల 23న ఉత్తరాంధ్ర స్థాయి ఓపెన్ చెస్ పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి కేవీ.జ్వాలాముఖి బుధవారం తెలిపారు. ఈ పోటీల్లో విజయనగరం జిల్లా క్రీడాకారులతో పాటు శ్రీకాకుళం, విశాఖపట్నం, పార్వతీపురం-మన్యం, అనకాపల్లి జిల్లాలకు చెందిన వారు పాల్గొంటారని పేర్కొన్నారు. ఓపెన్ విభాగంతో పాటు అండర్-7,9,11,13,15 వయస్సుల విభాగాల్లోని బాలబాలికలకు పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీల్లో ఓపెన్ విభాగంలో విజేతకు రూ.30వేల నగదు బహుమతి ప్రదానం చేయనుండగా..చిన్నారుల విభాగంలో విజేతలకు ప్రత్యేక నగదు బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనదలచిన క్రీడాకారులు ముందుగా ఫోన్ 9703344488 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

197 మద్యం సీసాలతో వ్యక్తి అరెస్ట్



197 మద్యం సీసాలతో పట్టుబడిన శ్రీనివాసరావును అరెస్ట్ చేసిన ఎస్సై సాగర్‌బాబు



మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ సీఐ, సిబ్బంది

తెర్లాం: ఎటువంటి అనుమతులు లేకుండా 197 మద్యం సీసాలను అక్రమంగా తరలిస్తూ పట్టుబడిన వ్యక్తిని స్థానిక పోలీసులు అరెస్ట్ చేశారు. దీనికి సంబంధించి బుధవారం తెర్లాం ఎస్సై సాగర్ బాబు చెప్పిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని నందబలగ గ్రామానికి చెందిన ఆనెం శ్రీనివాసరావు తెర్లాం నుంచి 197మద్యం సీసాలు తీసుకువెళ్తుండగా అదే సమయంలో అటుగా వస్తున్న స్పెషల్ బ్రాంచ్, స్థానిక పోలీసులకు గంగన్నపాడు గ్రామం వద్ద మద్యం పట్టుకున్నారు. అనంతరం మద్యం సీసాలను, తీసుకు వెళ్తున్న వ్యక్తిని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు. ఈ మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి మద్యం సీసాలను సీజ్ చేసుకున్నామని ఎస్సై తెలిపారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

బొండపల్లి: మండలంలోని వేంద్రాం గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి 9 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ జె.జనార్దనరావు తెలిపారు. గ్రామానికి చెందిన లెంక అప్పలనాయుడు గ్రామంలోని తన ఇంటి వద్ద అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించి అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్సై పి.నరేంద్ర కుమార్, హెచ్‌సీలు జె.బాషా, లోకాభిరామ్, రాజు, గంగాధరుడు తదితరులు పాల్గొన్నారు.

ఫ్లోటింగ్ జెట్టీకి గ్రహణం



చింతపల్లి ఫ్లోటింగ్ జెట్టీ నిర్మించాల్సిన ప్రదేశం



జెట్టీ లేకపోవడంతో తిప్పలవలసలో ఒడ్డున నిలిపిన పడవలు

- ఆరునెలలుగా ముందుకు సాగని పనులు
- మత్స్యకారులను నిర్లక్ష్యం చేస్తున్న కూటమి ప్రభుత్వం
- వేటసాగక ఇబ్బందులు పడుతున్న గంగపుత్రులు

పూసపాటిరేగ: జిల్లాలో తీరప్రాంతమైన చింతపల్లిలో ఫ్లోటింగ్ జెట్టీ నిర్మాణానికి గ్రహణం పట్టింది. మత్స్యకారుల జీవనోపాధి మెరుగుపరచాలన్న గత ప్రభుత్వ ఆశయానికి కూటమి ప్రభుత్వం తూట్లు పొడుస్తోంది. ఎన్నికల ముందు అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుమారు రూ.23 కోట్లు మంజూరు చేస్తూ వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. అ తరువాత వచ్చిన కూటమి ప్రభుత్వం జెట్టీని పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. ఫ్లోటింగ్ జెట్టీకి పరిపాలన, ఆర్థిక అనుమతులపై కనీసం పట్టించుకోకపోవడంతో టెండర్ ప్రక్రియ జరగలేదు. ఫ్లోటింగ్ జెట్టీ నిర్మాణం పూర్తయితే జిల్లాలోని తీరప్రాంతంలో ఉన్న సుమారు 21 వేల మంది మత్స్యకారులు జీవన విధానం మెరుగుపడేది. జెట్టీలేక పోవడంతో వేట సాగక తీరప్రాంత మండలాలైన పూసపాటిరేగ, భోగాపురం నుంచి సుమారు 6 వేల మంది మత్స్యకారులు దేశంలోని వివిధ ప్రాంతాలకు వలస వెళ్లారు. తమిళనాడు, గుజరాత్, ఒడిశా రాష్ట్రాలకు బతుకు తెరువు కోసం మత్స్యకారులు వలస పోయారు. జెట్టీ నిర్మాణం పూర్తయితే సుమారు 885 బోట్లకు వరకు జెట్టీలో నిలుపుకునే అవకాశం ఉంది. జెట్టీలేక పోవడంతో సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించిన బోట్లు ట్రాక్టర్ సహాయంతో ఒడ్డుకు చేర్చడంతో లక్షలాది రుపాయల విలువైన బోట్లు తక్కువ కాలంలోనే దెబ్బతింటున్నాయని మత్స్యకారులు వాపోతున్నారు. జిల్లాలో 27 కిలోమీటర్ల తీరప్రాంతంలో పూసపాటిరేగ, భోగాపురం మండలాలను కలుపుతూ 19 మత్స్యకార గ్రామాలు ఉన్నాయి. ఆయా గ్రామాల్లో 21 వేల మంది మత్స్యకారులు జీవిస్తుండగా వారిలో వేటపై ప్రత్యక్షంగా 6 వేల మంది, 15 వేల మంది పరోక్షంగా ఆధారపడి జీవిస్తున్నారు. కూటమి సర్కారు మత్స్యకారుల సంక్షేమంపై దృష్టి సారించి ఎంతో కాలంగా మత్స్యకారులు కళగా ఉన్న ఫ్లోటింగ్ జెట్టీ నిర్మాణం పూర్తిచేసే విధంగా అడుగులు ముందుకు పడాలని మత్స్యకారులు కోరుతున్నారు.

ఫ్లోటింగ్ జెట్టీ నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి

ఫ్లోటింగ్ జెట్టీ నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలి. టెండర్ దశలో ఉన్న ఫ్లోటింగ్ జెట్టీకి అనుమతులు మంజూరు చేసి మత్స్యకారుల సంక్షేమంపై దృష్టి సారించాలి. దశాబ్దాలుగా ఎదురు చూస్తున్న మత్స్యకారుల కలను సాకారం చేయాలి.

బర్రి చినఅప్పన్న, జిల్లామత్స్యకార సహకార సొసైటీ అధ్యక్షుడు విజయనగరం

మత్స్యకారుల చిరకాల వాంఛ

ఫ్లోటింగ్ జెట్టీ నిర్మాణం మత్స్యకారుల చిరకాల వాంఛ. జెట్టీ నిర్మాణం పూర్తయితే ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎంతో మంది మత్స్యకారుల జీవనోపాధి మెరుగుపడుతుంది. ప్రభుత్వం మత్స్యకారుల సమస్యలను దృష్టిలో పెట్టుకుని జెట్టీ నిర్మాణంపై దృష్టిసారించాలి.

బొ.కొర్లయ్య, చింతపల్లి

ఆరుగురు ఎనర్జీ అసిస్టెంట్లకు నోటీసులు

చీపురుపల్లి: గ్రామీణ విద్యుత్ సహకార సంఘం (ఆర్ఈసీఎస్) పరిధిలో కొన్నేళ్ల క్రితం నియామకాలు జరిగి ప్రస్తుతం విధుల్లో ఉన్న ఆరుగురు ఎనర్జీ అసిస్టెంట్లకు నోటీసులు జారీ చేసినట్లు ఆ సంస్థ ఎం.డి. పి.రమేష్ తెలిపారు. తప్పుడు విద్యార్హత ధ్రువీకరణ పత్రాలు సమర్పించి ఉద్యోగాలు పొందినట్లు గ్రీవెన్స్‌సెల్‌లో ఫిర్యాదులు అందడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు ఆరుగురు ఉద్యోగులకు నోటీసులు జారీ చేశామని తెలిపారు. వారి విద్యార్హత ధ్రువీకరణ పత్రాలపై సంబంధిత ఉద్యోగులు వివరణ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఆర్ఈసీఎస్ పరిధిలో 59 మంది ఎనర్జీ అసిస్టెంట్ల నియామకాలు గతంలో జరిగినట్లు చెప్పారు. వారిలో ఆరుగురు మాత్రమే ఇతర రాష్ట్రాల్లో తప్పుడు విద్యార్హత ధ్రువీకరణ పత్రాలు సమర్పించినట్లు గ్రీవెన్స్‌సెల్‌లో ఫిర్యాదు నమోదైందన్నారు. తాజాగా ఇచ్చిన నోటీసులకు సంబంధిత ఉద్యోగులు ఇచ్చిన సమాధానం ఆధారంగా చర్యలు ఉంటాయని తెలిపారు.

జీబీఎస్ వ్యాధిపై ఆందోళన వద్దు

విజయనగరం ఫోర్ట్: గులియన్ బర్రీ సిండ్రోమ్ (జీబీఎస్) వ్యాప్తిపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ అన్నారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో వైద్యాధికారులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యాధిని ఎదుర్కొనడానికి జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటుచేసినట్లు వెల్లడించారు. వ్యాధి నిర్ధారణ, కట్టడిచేయడానికి అవసరమైన ల్యాబ్‌లు, మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలని తెలిపారు. పరిశుభ్రమైన తాగునీరు, ఆహారాన్ని తీసుకోవాలన్నారు. వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. తాగునీటి పథకాలను షెడ్యూల్ ప్రకారం క్లోరినేషన్ చేయాలని, నీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని, పారిశుధ్య కార్యక్రమాలను ముమ్మరం చేయాలని అధికారులను ఆదేశించారు. డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్. జీవన రాణి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ సంబంగి అప్పలనాయుడు మాట్లాడుతూ వ్యాధి సోకితే కాళ్లు, చేతులు బలహీన పడడం, చలనం తగ్గిపోవడం, కొన్నిసార్లు శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఏర్పడతాయన్నారు. ఈ వ్యాధి 80 శాతం మందికి సహజంగానే తగ్గిపోతుందన్నారు. 15 శాతం మందికి చికిత్స అవసరమని, కేవలం 5 శాతం మందికి మాత్రమే పరిస్థితి విషమంగా మారుతుందన్నారు.

బారిక బందను పరిశీలించిన తహసీల్దార్

- కంచె తొలగించాలని ఆదేశాలు

సాక్షి ఎఫెక్ట్



కంచెను తొలగించాలని ఆదేశిస్తున్న తహసీల్దార్ విజయభాస్కర్

దత్తిరాజేరు: మండలంలోని ఇంగిపలాపల్లి గ్రామ రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 179లో ఎకరా 60 సెంట్లు బారిక బంద దురాక్రమణపై సాక్షిలో వ్చిన కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. ఈ మేరకు తహసీల్దార్ విజయభాస్కర్ సిబ్బంది బుధవారం చెరువు దగ్గరకు చేరుకుని చుట్టూ వేసిన ఇనుప కంచెను, చెరువు గట్టుపై వేసిన కంచెను తొలగించాలని ఆక్రమించిన ఎస్ఆర్ఐ బంధువులను ఆదేశించారు. రెండు రోజుల్లో ప్రభుత్వ భూమిలో వేసిన కంచెను తీస్తామని రైతులు రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా చేస్తామని వారు కోరడంతో..రెండు రోజుల్లో తొలగించని పక్షంలో జేసీబీతో తొలగిస్తామని తహసీల్దార్ వారికి చెప్పారు. 200 ఎకరాలకు వెళ్లే దారిని మూసివేయడంతో రైతులు ఆందోళన చెంది సర్పంచ్ గర్బాపు విజయలక్ష్మి, భర్త శ్రీనివాసరావు ద్వారా పత్రికలో కథనం రావడంతో పొలాలకు వెళ్లే మోక్షం కలిగిందని రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

గిరిజనులకు మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయం



అధికారులతో సమీక్షిస్తున్న ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాస్తవ

పార్వతీపురం: గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాలను కల్పించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న డీఏ-జేజీయూజీ కార్యక్రమం వేగవంతంగా చేయాలని ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాస్తవ అధికారులకు ఆదేశించారు. ఈ మేరకు బుధవారం ఆయన ఐటీడీఏ కార్యాలయంలో డీఏ-జేజీయూఏ కార్యక్రమం ప్రగతిపై వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ ధరతి ఆబా గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్(డీఏ-జేజీయూఏ) కార్యక్రమం గిరిజన వర్గాల సామాజిక ఆర్థిక స్థితిగతులను మెరుగుపరిచేందుకు రూపొందించిందన్నారు. దీన్ని పటిష్ఠంగా అమలు చేయాలని సూచించారు. పనులను వేగవంతం చేయాలని కోరారు. ఈ సమీక్షలో ఆన్‌లైన్ సబ్‌కలెక్టర్ యశ్వంత్ కుమార్ పాల్గొనగా, ఇన్‌చార్జ్ హౌసింగ్ పీడీ పి.ధర్మచంద్రా రెడ్డి, పీఆర్ ఎస్ఈ బి.చంద్రశేఖర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ఒ.ప్రభాకరరావు, డీఎంహెచ్ఓ ఎస్.భాస్కరరావు, ఐసీడీఎస్ పీడీ దుర్గా చక్రవర్తి, ఎస్ఎస్ఏ పీఓ ఆర్.తేజేశ్వరరావు, డిప్యూటీ డీఎంహెచ్ఓ టి.జగన్ మోహన్‌రావు, టీడబ్ల్యూ ఈఈ మణిరాజు, స్కిల్ డెవలప్‌మెంట్ డీఎస్‌డీఓ కంచిబాబు, జీసీసీ డీఎం మహేంద్రకుమార్, డీఎఫ్ఓ తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.